క్లుప్తంగా

## ఎమ్మెల్యేను సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు



**నర్వ:** ఎస్సీ రిజర్వేషన్లకు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించడంపై ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సన్మానం చేశారు. శాలువాతో సన్మానించి, అంబేడ్కర్ చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కృష్ణయ్య, శరణప్ప, రాయన్న, కాంగ్రెస్ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, చెన్నయ్యసాగర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వివేవర్ధన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు




**కోస్గి రూరల్:** కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ కోస్గి బార్ అసోసియేషన్ సభ్యులు కోర్టు విధులను బహిష్కరించి నల్ల బ్యాడ్జీలు ధరించి గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓం ప్రకాష్ మాట్లాడుతూ.. పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో ప్రభాకర్, వీఎన్ గౌడ్, భీమేష్, రాజురెడ్డి, మల్లేష్, తాజ్‌ఖాన్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

## 28న అవగాహన సదస్సు

**మాగనూర్:** భూ భారతి అమలుపై అవగాహన సదస్సును 28 సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సిక్తా పట్నాయక్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఆర్డీఓ తదితరులు పాల్గొనున్నట్లు తెలిపారు. రైతులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**మద్దూరు:** రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి రెవెన్యూ సదస్సులు గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ మహేష్‌గౌడ్ రైతులకు సూచించారు. గురువారం మద్దూరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసినా రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మద్దూరు, భీంపూర్, నాగంపల్లి, సాపన్‌చెరువు తండాలకు చెందిన రైతులు 109 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ వాసుదేవరావ్, ఆర్ఐలు అమరేందర్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**మక్తల్:** మండలంలోని ముష్టిపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో గురువారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్‌చైర్మన్ గణేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీలర్ లక్ష్మారెడ్డి, నర్సిములు, మాజీ ఎంపీపీ హన్మంతు, రాంరెడ్డి, చందపూర్ రాములు, దామోదర్, సుధాకర్‌రెడ్డి, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**కొత్తపల్లి:** మండల పరిధిలోని లింగాల్‌చేడ్ వాగు నుంచి గురువారం తెల్లవారు జామున అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను టాస్క్‌ఫోర్స్, మద్దూరు పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రఘునాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే

**మద్దూరు:** మండలంలోని ఖాజీపూర్ అప్పిరెడ్డిపల్లి, చింతల్‌దిన్నే గ్రామాల్లో అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు గురువారం లబ్ధిదారులు ఎంపిక చేపట్టారు. ఖాజీపూర్‌లో ఎంపీడీఓ నర్సింహారెడ్డి 12 మంది, అప్పిరెడ్డిపల్లిలో ఎంపీఓ రామన్న 10 మంది, చింతల్‌దిన్నేలో ఏఈ రామకృష్ణ 14 మందిని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి స్థితిగతులపై ఆరా తీశారు. నిజమైన అర్హులకు అందేలా ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

**మక్తల్:** పట్టణంలోని 3వ వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి కమిషనర్ శంకర్‌నాయక్ సర్వే చేపట్టారు. ఇంటి పరిస్థితి తదితర వివరాలు సేకరించారు. వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వార్డు అధికారి వెంకటయ్య, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బ్యాగరీ సురేష్, డోగి ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

**కోస్గిరూరల్:** ప్రభుత్వం ఎల్ వన్ జాబితాలో ఉండి ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన రిపోర్టు ఆధారంగా అర్హులైన లబ్ధిదారుల పరిశీలన చేపట్టినట్లు మండల వెరిఫికేషన్ అధికారులు శ్రీధర్, రామకృష్ణ, నిర్మల అన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో సర్వే చేపట్టామని పూర్తి జాబితా సిద్ధం చేసి అధికారులకు నివేదిక అందజేయనున్నట్లు పేర్కొన్నారు.



మక్తల్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్న కమిషనర్ శంకర్‌నాయక్



ఖాజీపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ నర్సింహారెడ్డి,సభ్యులు



ముక్తిపాడ్‌లో లబ్ధిదారుల ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

## కార్మిక సమావేశాలకు తరలిరావాలి

**మరికల్:** మండల కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వ్యవసాయ కార్మిక సమావేశాలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్మికులు తరలి రావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. మండలంలో గురువారం చిత్తనూర్‌తో పాటు మరికల్‌లో జరుగుతున్న ఉపాధి కూలీలచే సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను చిన్నచూపు చూస్తున్నాయన్నారు. ఉపాధి పనుల వద్ద కూలీలకు కనీస వసతులు కూడా కల్పించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అనేక కార్మిక సమస్యలపై ఈ నెల 26, 27న మరికల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి సమావేశాలకు అధిక సంఖ్యలో పాల్గొన్ని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు వెంకట్, నాగయ్య, వెంకట్రాములు, ప్రకాష్, మల్లేష్ పాల్గొన్నారు.

**సమావేశాలు జయప్రదం చేయండి**

**మాగనూర్:** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత సమావేశాలు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుంజనూర్ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 26, 27 తేదిల్లో మరికల్ పట్టణ కేంద్రంలో సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి రోజు వ్యవసాయ కూలీల ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. బహిరంగ సభకు అఖిల భారత అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకట్, విజయ రాఘవన్, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, పలువురు ముఖ్య నాయకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. బహిరంగ సభలో వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా రూ.12 వేలు, కనీస వేతనం అమలు, రోజువారీ కూలీ రూ.600, 200 పని దినాలు తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కావున కూలీలందరూ పెద్ద ఎత్తున హాజరై బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

## కార్మికుల సేవలతోనే గ్రామాలు పరిశుభ్రం

**మరికల్:** కార్మికులు సేవల వల్లే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటున్నాయని ఎంపీడీఓ కొండన్న అన్నారు. మండలంలోని కన్మనూర్ గ్రామంలో గురువారం ఘనంగా జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ పంచాయతీ కార్మికులకు స్వీట్లు అందజేశారు. కార్మికుల సేవలు మరువలేనివన్నారు. అనంతరం గ్రామసభ నిర్వహించి గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పరిశుభ్రతపై తీసుకోవాల్సిన అంశాలపై తీర్మానం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రమేష్‌కుమార్, దామోందర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, రాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, చెన్నయ్య, తిప్పన్న పాల్గొన్నారు.

**ధన్వాడ:** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సభలో పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో నిర్మల, శాంత, సుదర్శన్‌గౌడ్, రాఘవేందర్‌రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



కన్మనూర్‌లో జాతీయ పంచాయతీ దినోత్సవం జరుపుకుంటున్న ఎంపీడీఓ, సిబ్బంది

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు సురక్షితం

**నవాబుపేట:** ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు సురక్షితంగా జరుగుతున్నాయని జిల్లా ప్రోగ్రాం అధికారి భాస్కర్ నాయక్ అన్నారు. నవాబుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం నలుగురు గర్భిణులకు కాన్పులు చేశారు. వీరిలో ఒకరికి సాధారణ ప్రసవంలో కవలలు జన్మించారు. సమాచారం అందుకున్న జిల్లా ప్రోగ్రాం అధికారి పీహెచ్‌సీని సందర్శించి తల్లీబిడ్డల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వారు పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని.. అవసరమైన మందులు అందించి డిశ్చార్జి చేయాలని వైద్యులకు సూచించారు. అనంతరం పలు రికార్డులతో పాటు వ్యాక్సినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై పూర్తి అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. గర్భిణులు, చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వందశాతం వేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తేజశ్రీ, సుభాష్ చంద్రబోస్, రాఘవేందర్, శరభలింగం, చక్రపాణి పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో జన్మించిన కవలలను పరీక్షిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి భాస్కర్‌నాయక్

## మామిడి తోటల్లో పండు ఈగను నివారించాలి



పెద్దరేవల్లిలో మామిడి తోటలను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారులు

**రాజాపూర్:** ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మామిడి తోటలకు చీడపీడలు సోకే ప్రమాదం ఉందని.. రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ క్లస్టర్ అధికారి మహేందర్ సూచించారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో మామిడి తోటలను ఆయన పరిశీలించి రైతులకు పలు సూచలు చేశారు. ప్రస్తుతం కురిసిన వర్షాల కారణంగా పండు ఈగ ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. దీన్ని నివారించేందుకు సోలార్ లైట్‌ట్రాప్ మందు పిచికారీ చేయాలన్నారు. మామిడి క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో 30శాతం రాయితీపై సోలార్ లైట్‌ట్రాప్ అందుబాటులో ఉందని తెలిపారు. దీన్ని ధర రూ.1,450 కాగా.. సబ్సిడీ పోను రైతులు రూ.1,015 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మామిడి రైతులు సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం హార్టికల్చర్ హెచ్ఓ 89 777 14439 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. అంతేకాకుండా 2025–26 ఆర్థిక సంవత్సరం ఆయిల్‌పాం సాగుపై ఆసక్తి ఉన్న రైతులకు డ్రిప్, మొక్కలను సబ్సిడీపై అందించనున్నట్లు తెలిపారు.

## విద్యార్థికి అభినందన

**కోస్గి రూరల్:** ఇంటర్ ఫలితాల్లో పట్టణానికి చెందిన మూలింటి సాత్విక్ ఎంపీసీ విభాగంలో 668 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా గురువారం కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి విద్యార్థిని అభినందించారు. ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, నాగులపల్లి నరేందర్, మాస్టర్ శ్రీనివాస్, బాలేష్, భానునాయక్,రాము, మోహన్‌రెడ్డితదితరులు పాల్గొన్నారు.

## కంటి వైద్య శిబిరం



**ఊట్కూరు:** మండలంలోని పెద్దపొర్ల గ్రామంలో గురువారం పుష్పగిరి కంటి ఆసుపత్రి సిబ్బంది ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దపొర్ల, చిన్నపొర్ల, కొల్లూరు, మల్లేపల్లి తదితర గ్రామాల నుంచి వచ్చిన రోగులకు పరీక్షలు చేశారు. కొందరికి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు సిఫారసు చేశారు. అనంతరం ఉచితంగా అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు రాజశేఖర్‌గౌడ్, రాఘవేంద్రగౌడ్, సాక రమేష్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా చదువుల పండుగ




**కృష్ణా:** మండలంలోని ముడుమాల్ ప్రాథమిక పాఠశాలలో చదువుల పండుగ కార్యక్రమం ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రధానోపాధ్యాయుడు శేఖర్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి గ్రామ యువకుల సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ విద్యాసాగర్, సీఎంఓ రాజేంద్రకుమార్, ఎంఈఓ నిజాముద్దీన్, ఎస్ఐ ఎండీ నవీద్, నాయకులు తమ్మప్ప, వెంకటేష్, రిటైర్డు ఉపాధ్యాయుడు రాఘవేంద్ర, బీటీఎం ఫౌండేషన్ చైర్మన్ తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ‘ఉగ్ర’దాడి పిరికిపంద చర్య



మక్తల్‌లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు



ధన్వాడలో ర్యాలీ చేస్తున్న యువకులు

**కృష్ణా:** కశ్మీర్‌లోని ఉగ్రమూకల దాడి పిరికిపంద చర్య అని బీజేపీ మండల అధ్యక్షుడు నల్లె నర్సప్ప అన్నారు. విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. ఈ దుర్ఘటనకు పాకిస్తాన్ మూల్యం చెల్లించక తప్పదని మండిపడ్డారు. అన్ని పార్టీలు ముక్త కంఠంతో ఖండించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ధన్వాడ:** పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మలు శాంతించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలో యువత ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సంత బజార్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఉమేష్, సుదర్శన్‌గౌడ్, భాస్కర్, నవీన్, కురుమూర్తి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఊట్కూరు:** కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్యని ఎంపీజే జిల్లా అధ్యక్షుడు ఖాజీం ఉస్సేన్, హోటల్ ఖాలిక్, అజీజ్ గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడం క్షమించరాని నేరమన్నారు. కేంద్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుని ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**మక్తల్:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో మారణ కాండకు బాధ్యులైన ఉగ్రవాదుల దిష్టిబొమ్మలను పట్టణంలోని వివేకనందా చౌరస్తాల్లో దహనం చేశారు. వివిధ ధార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు చంద్రకాంత్‌గౌడ్, అనిల్, కురమయ్య, మంజునాథ్, రామలింగం, వినయ్, రాజుగౌడ్, శేఖర్, బాలనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికే కమిటీలు

**నారాయణపేట:** కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు వార్డు కమిటీలు ఏర్పాటు చేస్తునట్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ. సలీం ఆధ్వర్యంలో 2వ వార్డులో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకంగా ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందన్నారు. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు సంఘటితం కావాలన్నారు. టీం వర్కుగా పని చేసేందుకు వార్డు కమిటీలు ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు జరుగుతున్న జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నిర్వహిస్తూ, స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులను, రాజ్యాంగాన్ని, ఒక నిర్దిష్ట ప్రణాళిక బద్ధంగా అవమాన పరుస్తున్న బీజేపీ ఎండ కట్టాలన్నారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు గడపగడపకు కరపత్రాన్ని పంచుతూ అవగాహన కల్పించారు.

**వార్డు కాంగ్రెస్ కమిటీ ఎన్నిక**

వార్డు అధ్యక్షుడిగా అఖిల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుర్మిట్కల్ రవి, ఉపాధ్యక్షుడిగా మురడి అజయ్ కుమార్, ఆకుతోట వినోద్, కార్యదర్శులుగా కొత్త కాపు చెన్నారెడ్డి, చింత రాకేష్, ప్రత్యేక ఆహ్వానితులుగా జొన్నలు సుభాష్, నూర్ వినోద్, సుతారి సత్తిరెడ్డి, ఎండీ రియాజ్, సంధ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్లు సరాఫ్ నాగరాజు, కురువ సుధాకర్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మనోహర్‌ప్రసాద్‌గౌడ్, నాయకులు వకీల్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## భూ సమస్యలకు సత్వర పరిష్కారం

**కోయిల్‌కొండ:** ప్రభుత్వం నూతనంగా రూపొందించిన భూ భారతి చట్టంతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. కోయిల్‌కొండ రైతువేదిక సమీపంలో గురువారం భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతి చట్టంతో సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసిన భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ఆధార్ కార్డులాగే ప్రతి భూ కమతానికి భూధార్ కార్డు జారీ చేయనున్నట్లు చెప్పారు. భూమి రిజిస్ట్రేషన్ సమయంలోనే హద్దులను నిర్ణయించి.. సంబంధిత మ్యాప్‌తో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకం అందించనున్నట్లు తెలిపారు.

■ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి మాట్లాడుతూ.. రైతులందరికీ ఉపయోగపడేలా సీఎం రేవంత్‌రెడ్డి అందరి ఆమోదంతో భూ భారతి చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చారని అన్నారు. ఈ చట్టంపై రైతులందరికీ అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో ధరణి కారణంగా అనేక భూ సమస్యలతో రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చిందన్నారు. భూ భారతి చట్టం ద్వారా తహసీల్దార్ ద్వారా సమస్య పరిష్కారం కాకుంటే ఆర్డీఓకు, అక్కడి నుంచి కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చన్నారు. అక్కడ కూడా సమస్య పరిష్కారం కాకుంటే ల్యాండ్ ట్రిబ్యునల్‌కు అప్పీల్‌కు వెళ్లవచ్చన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్డీఓ నవీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి, చిత్రంలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

## చేనేత హస్తకళా ప్రదర్శనకు స్పందన

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఈ నెల 9న ప్రారంభమైన చేనేత హస్తకళా ప్రదర్శనకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. చేనేత కళాకారులతో అద్భుత అల్లికలతో తయారైన సిల్క్, కాటన్ వస్త్రాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉపాడకు చెందిన చీరలతో పాటు కుర్తీస్, ఇతర డ్రెస్ మెటీరియల్స్ లభ్యమవుతుండటంతో ప్రజలు వీటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.



వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

# వక్ఫ్ బిల్లు వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం

**స్టేషన్ మహబూబ్‌నగర్:** అల్లాహ్ పేరిట ముస్లిం పూర్వీకులు ఇచ్చిన భూములను లాక్కునే కుట్రలో భాగంగానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ చట్టం తీసుకువచ్చిందని బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అబ్దుల్ రహెమాన్, మోసీన్ ఖాన్, అన్వర్‌పాషా, తఖీ హుస్సేన్, హాఫీజ్ ఇద్రీస్ మాట్లాడారు. ముస్లింల ఆస్తులపై కేంద్రం కన్నుపడిందని.. రాబోయే రోజుల్లో క్రిస్టియన్, సిక్కులు, జైన్‌లు, బౌద్ధుల ఆస్తులను సైతం లాక్కునే అవకాశాలు ఉన్నాయన్నారు. దేశంలోని లౌకికవాదులంతా ఈ చట్టానికి వ్యతిరేకంగా కలిసిరావాలని విజ్ఞప్తి చేశారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. ఆలిండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు పిలుపుమేరకు ఈ నెల 26వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే బహిరంగసభకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మోహసిన్, మహ్మద్ ఎక్బాల్, సుల్తాన్, రహీం,మేరాజ్, జావిద్ ఉన్నారు.

❋ రాజ్యాంగాన్ని రద్దుచేసి మనుస్మృతి పాలన తీసుకురావడంలో భాగంగానే వక్ఫ్ సవరణ బిల్లును దేశ ప్రజలపై రుద్దారని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలిండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 26న జిల్లా కేంద్రంలో జరిగే బహిరంగ సభలో ఉమ్మడి జిల్లాలోని సంఘం బాధ్యులు, లౌకికవాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వహీద్‌షా, సిరాజ్‌ఖాన్, నిజాముద్దీన్, షేక్ ఫరీద్, షేక్ హబీబ్ ఉన్నారు.

**ఆర్ఎస్ఎస్ కుట్రలో భాగమే..**

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఆర్ఎస్ఎస్ కుట్రలో భాగంగా వక్ఫ్ సవరణ చట్టం చేశారని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ నిర్వహించగా.. ముస్లిం, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆవాజ్ రాష్ట్ర నాయకుడు ఎండీ జబ్బార్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. రెండేళ్ల క్రితం ట్రిబుల్ తలాక్ తీసుకువచ్చి ముస్లిం సంప్రదాయాలను విచ్ఛిన్నం చేశారని ఆరోపించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి రామచందర్, రిటైర్డ్ లెక్చరర్ గులాం గౌస్, ఆవాజ్ అధ్యక్ష, కార్యదర్శులు ఖయ్యూం, సలీం, ఆదివిష్ణు, ఖదీర్, మషీన్ ఖాన్ ఉన్నారు.



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అబ్దుల్ రహెమాన్